యూపీఐ కొత్త నిబంధనలు నేటి నుంచి

- బ్యాంకు ఖాతాలో కనీస బ్యాలెన్స్ తప్పనిసరి
- కొత్త ఐటీ శ్లాబ్, కొత్త పింఛన్ విధానం అమల్లోకి



న్యూఢిల్లీ, మార్చి 31: కేంద్ర ప్రభుత్వపు కొత్త బడ్జెట్(2025-26) నేటి నుంచి అమల్లోకి రానుంది. బడ్జెట్‌లో పేర్కొన్న ఆదాయపన్ను కొత్త శ్లాబులు, మినహాయింపులు, యూపీఐ రూల్స్, ఇతర నిబంధనలూ ఏప్రిల్ 1 నుంచి అమలు కానున్నాయి. ఈ నేపథ్యంలో పౌరులందరూ ఆయా నిబంధనల మేరకు జాగ్రత్తలు పాటించడం ద్వారా మెరుగైన ఆర్థిక నిర్వహణ చేసుకోవచ్చని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు.

ఆదాయపు పన్ను మినహాయింపు

ఏడాదికి రూ.12లక్షల లోపు ఆదాయం కలిగిన వాళ్లకు పన్ను పరిధి నుంచి మినహాయింపు లభించనుంది. ఇందులో వేతన జీవులకు రూ.75 వేలు రాయితీ కల్పించింది. అంటే వారికి రూ.12.75లక్షల వరకు మినహాయింపు వర్తించనుంది.

కొత్త పింఛన్ విధానం

యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ ప్రకారం 25 ఏండ్లకు పైగా సర్వీసు కలిగిన ఉద్యోగులకు చివరి 12 నెలల వేతనంలో బేసిక్ సాలరీకి సమానంగా పింఛన్ సదుపాయం కలగనుంది. కేంద్ర ప్రభుత్వంలోని 23లక్షల ఉద్యోగులు యూపీఎస్ పరిధిలోకి రానున్నారు.

బ్యాంక్ ఖాతాలో కనీస బ్యాలెన్స్

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా-ఎన్‌పీసీఐ మార్గదర్శకాల ప్రకారం యూపీఐ చెల్లింపులు చేయాలంటే బ్యాంకులో కనీస బ్యాలెన్స్ ఉండాల్సిందే అనే నిబంధన అమలు కానుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) తమ మినిమం బ్యాలెన్స్ నిబంధనలను సవరించనున్నాయి. కనీస నగదు నిల్వలు లేకపోతే పెనాల్టీ పడుతుంది. అలాగే పలు బ్యాంకులు క్రెడిట్ కార్డ్ రివార్డుల విధానాన్ని సవరించాయి.

యాక్టివ్‌గా లేని ఫోన్ నెంబర్లు డియాక్టివేట్

వినియోగంలో లేని ఫోన్ నంబర్లతో లింక్ అయిన యూపీఐలు డీయాక్టివేట్ కానున్నాయి. అంతేకాకుండా ఫోన్ నంబర్‌తో సంబంధం లేకుండా యూపీఐ వినియోగిస్తున్న ఖాతాదారులు బ్యాంకుల్లో ఫోన్ నంబర్లను అప్‌డేట్ చేసుకోవాలి.

జీఎస్టీలో ఎంఎఫ్ఏ తప్పనిసరి

జీఎస్టీలో మార్పుల ప్రకారం చెల్లింపుల సమయంలో పోర్టల్‌లోకి లాగిన్ అయ్యేందుకు మల్టీ ఫ్యాక్టర్ అథెంటికేషన్(ఎంఎఫ్ఏ) తప్పనిసరి కానుంది. 180 రోజులు దాటిన పాత బిల్లులను ఈ పద్ధతిలో చేయడం కుదరదు.

అధిక పని భారంతో ఆగమాగం

- వారానికి 48 గంటలకు మించి పని చేస్తున్న 72 శాతం మంది
- ప్రతి నలుగురు ఇండియన్ టెకీలలో ఒకరికి నిస్సత్తువ, నీరసం
- బ్లైండ్ కమ్యూనిటీ యాప్ సర్వేలో దిగ్భ్రాంతికర వాస్తవాలు

హైదరాబాద్: వారానికి 70 గంటలు, 90 గంటలు పని చేయాలని కొందరు కార్పొరేట్ లీడర్లు సూచిస్తున్న తరుణంలో భారతీయ ఐటీ ప్రొఫెషనల్స్ ఇప్పటికే ఆ స్థాయిలో పని చేస్తున్నట్లు తాజా అధ్యయనం వెల్లడించింది. పని ఒత్తిడి వల్ల ప్రతి నలుగురు భారతీయ ఐటీ ప్రొఫెషనల్స్‌లో ఒకరు తీవ్రమైన బర్న్ అవుట్ ఎపిడమిక్ (నిస్సత్తువ, నీరసం)తో బాధ పడుతున్నట్లు తెలిపింది. బ్లైండ్ అనే గుర్తు తెలియని కమ్యూనిటీ యాప్ భారత్‌లో మార్చి 12 నుంచి 19 వరకు ఈ సర్వేను నిర్వహించింది. 1,450 మంది ఐటీ ప్రొఫెషనల్స్ ఈ సర్వేలో పాల్గొన్నారు. ఈ సర్వే ప్రకారం 72 శాతం మంది ప్రొఫెషనల్స్ చట్టబద్ధమైన వారానికి 48 గంటల పని వేళలను మించి పని చేస్తున్నారు. 25 శాతం మంది వారానికి 70 గంటలు, అంతకన్నా ఎక్కువ సమయం పని చేస్తున్నారు. ఫలితంగా తమలో శారీరక, మానసిక నిస్సత్తువ ఆవరించిందని 83 శాతం మంది చెప్పారు. ఈ సర్వే ప్రకారం, కొన్ని కంపెనీలు పని గంటలను మితిమీరి పెంచేస్తున్నాయి. ఐటీ ప్రొఫెషనల్స్ ఎంత ఎక్కువ సమయం పని చేస్తే, అంత ఎక్కువ నిస్సత్తువతో బాధ పడుతున్నారు. తమ శక్తి సన్నగిల్లిందని మొత్తం మీద 83 శాతం మంది చెప్పినప్పటికీ, కొన్ని కంపెనీల్లో ఇది 90 శాతం వరకు ఉంటున్నది. నిర్ణీత పని గంటల కన్నా ఎక్కువ సమయం పని చేసినప్పటికీ, 'కార్యాలయం పనితో డిస్‌కనెక్ట్ అయ్యే హక్కు'కు వీరు దూరమవుతున్నారు. కార్యాలయ పని వేళలు ముగిసిన తర్వాత కూడా కార్యాలయ పనికి సంబంధించిన సందేశాలకు స్పందించడం బాధ్యతగా భావిస్తున్నామని 68 శాతం మంది తెలిపారు.

కొవిడ్-19 మహమ్మారి సమయంలో ఇంటి వద్ద నుంచే పని చేయడం అలవాటు అయినప్పటి నుంచి ఈ పరిస్థితులకు బీజాలు పడినట్లు కొందరు ఉద్యోగులు వాపోయారు. ఉద్యోగులు ఎల్లప్పుడూ ఆన్‌లైన్‌లో ఉండాలని కంపెనీలు ఆశించడం అప్పటి నుంచే అలవాటుగా మారింది. ఎక్కువ సమయం పని చేస్తుండటానికి మూల కారణం మితిమీరిన పని చేయాలనే తీవ్రమైన ఒత్తిడి అని ఐటీ ప్రొఫెషనల్స్ చెప్పారు. వీరు అధిక గంటలు పని చేయాలన్న 'ఇన్ఫోసిస్' నారాయణ మూర్తిని, ఎల్ అండ్ టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యంను విమర్శించారు. ప్రామాణిక పని గంటల కన్నా ఎక్కువ సమయం పని చేయడం వల్ల ఒత్తిడికి గురవుతున్నామని లేదా తమ సహోద్యోగులు అటువంటి భావనలో ఉన్నారని సర్వేలో పాల్గొన్న 75 శాతం మంది వెల్లడించారు. దీనివల్ల భారత దేశ ఐటీ రంగంలో మితిమీరిన పని, నిస్సత్తువ ఒక దాని వెంట మరొకటి పునరావృతమవుతున్నాయని కుండ బద్దలు కొట్టారు.

మెరుగైన ఫలితాలు రావు!

అతిగా పని చేసినంత మాత్రాన మెరుగైన ఫలితాలు వస్తాయనేమీ లేదని చాలా మంది ప్రొఫెషనల్స్ చెప్పారు. కష్టపడి పని చేస్తున్నారనే భావన పైకి కనిపించడం తప్ప ప్రయోజనం ఉండదని తెలిపారు. ఆ స్థాయిలో ఎవరైనా ఆరు నెలల పాటు పని చేస్తే వారి కథ ముగిసిపోతుందని ఓ ఉద్యోగి ఆవేదన చెందారు. అయితే నేటి తరం కంపెనీ లీడర్స్‌లో చాలా మంది వర్క్-లైఫ్ బ్యాలన్స్ గురించి అర్థం చేసుకుంటున్నారని తెలిపారు.

సెప్టెంబర్‌లో ప్రధాని మోదీ రిటైర్!

ఆర్ఎస్ఎస్ ఆఫీస్ సందర్శనపై ఎంపీ సంజయ్ రౌత్ వ్యాఖ్యలు

ముంబై: ఈ సంవత్సరం సెప్టెంబర్‌లో రిటైర్ అయ్యేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఏర్పాట్లు చేసుకుంటున్నారని, అందుకే ఆయన నాగ్‌పూర్‌లోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కా ర్యాలయాన్ని సందర్శించారని శివసేన(యూబీటీ) నాయకుడు, రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ వెల్లడించారు. గత 10-11 ఏళ్లలో ఒక్కసారి కూడా ఆర్ఎస్ఎస్ ప్రధాన కా ర్యాలయంలో అడుగుపెట్టని ప్రధాని మోదీ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు వీడ్కోలు చెప్పేందుకే అ క్కడకు వెళ్లారని సోమవారం నాడిక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రౌత్ వ్యాఖ్యానించారు.

మేం ద్రవిడులం కాదు

స్టాలిన్ ఉగాది పోస్ట్‌పై కన్నడిగుల ఆగ్రహం

చెన్నై: తమిళనాడు సీఎం స్టాలిన్ ఉగాది సందర్భంగా చేసిన పోస్ట్‌పై కన్నడిగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని సీఎం స్టాలిన్ తన సామాజిక మాధ్యమ ఖాతాలో తెలుగు, కన్నడ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అయితే ఈ పోస్ట్‌లో ఆయన కన్నడిగులను ద్రవిడులుగా పేర్కొనటం వివాదానికి దారితీసింది. కన్నడ ప్రజలను ద్రవిడులుగా సంబోధించటంపై కొంతమంది కన్నడిగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీతో కలిసి పోరాడేందుకు కన్నడిగులు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. కానీ. కన్నడ ద్రవిడ భాష కాదు. అది గుర్తుపెట్టుకోండి' అని కొందరు కన్నడిగులు కామెంట్స్ పెట్టారు.

పెరిగిన సహజ వాయువు ధర

న్యూఢిల్లీ: సీఎన్‌జీ, విద్యుత్తు, ఎరువులను ఉత్పత్తి చేయడానికి ఉపయోగించే, ఏపీఎంగా పిలిచే కీలకమైన ఇన్‌పుట్ అయిన సహజ వాయువు ధరను ప్రభుత్వం 4 శాతం పెంచింది. రెండేండ్ల వ్యవధిలో ఇలా ధరలు పెంచడం ఇదే మొదటిసారి. ప్రస్తుతమున్న ఎంఎంబీటీయూ 6.50 డాలర్ల నుంచి 6.75 డాలర్లకు పెంచుతున్నట్టు, కొత్త ధరలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తాయని పెట్రోలియం శాఖ ప్రకటించింది. 2026 మార్చి వరకు ఇదే ధర ఉంటుందని, తర్వాత 0.25 శాతం ధర పెరుగుతుందని అధికారులు చెప్పారు. ఈ సహజ వాయువును ప్రభుత్వ రంగ సంస్థలు ఉత్పత్తి చేస్తాయి.

ప్రధాని ప్రైవేట్ సెక్రటరీగా నిధి తివారీ

న్యూఢిల్లీ, మార్చి 31: ప్రధాని నరేంద్ర మోదీ ప్రైవేట్ సెక్రటరీగా ఐఎఫ్ఎస్ అధికారిణి నిధి తివారీని నియమించినట్టు కేంద్ర సిబ్బంది శాఖ సోమవారం ప్రకటించింది. 2014 బ్యాచ్‌కు చెందిన ఆమె ప్రస్తుతం పీఎంఓలో డిప్యూటీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. నిధి తివారీ నియామకాన్ని క్యాబినెట్ ఆపాయింట్‌మెంట్స్ కమిటీ ఆమోదించినట్టు మార్చి 29వ తేదీతో వెలువడిన ఉత్తర్వులు పేర్కొన్నాయి. యూపీకి చెందిన తివారీ గతంలో వారణాసిలో వాణిజ్య పన్నుల శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేశారు. పీఎంఓలో చేరడానికి ముందు ఆమె విదేశాంగ శాఖలో పనిచేశారు. నిరాయుధీకరణ, అంతర్జాతీయ భద్రతా వ్యవహారాల విభాగంలో ఆమె బాధ్యతలు నిర్వర్తించారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్‌కు భద్రతకు చెందిన అంశాలను నేరుగా నివేదించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు.

56% ప్రొఫెసర్ పోస్టులు ఖాళీ

- ఐఐటీలు, ఐఐఎంలు, ఎన్ఐటీలపై పార్లమెంటరీ స్థాయీ సంఘం నివేదిక
- బోధన నాణ్యత నిర్వీర్యంపై హెచ్చరిక

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక ఉన్నత విద్యా సంస్థల్లో 56 శాతం ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఐఐటీలు, సెంట్రల్ యూనివర్సిటీలూ ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నాయి. విద్య, మహిళలు, బాలలు, యువత, క్రీడలపై పార్లమెంటరీ స్థాయీ సంఘం నివేదిక ఈ వివరాలను వెల్లడించింది. దీనిని పార్లమెంటులో బుధవారం ప్రవేశపెట్టారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఫ్యాకల్టీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించింది. ఖాళీలను భర్తీ చేయకపోవడం వల్ల ఆయా విద్యా సంస్థల్లో బోధన నాణ్యత నిర్వీర్యమవుతున్నదని హెచ్చరించింది.

భర్తీ కాని రిజర్వుడు పోస్టులు

ఓబీసీలకు కేటాయించిన 3,652లో 1,521 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపింది. ఎస్సీలకు రిజర్వు చేసిన 2,315 పోస్టుల్లో 788, ఎస్టీలకు కేటాయించిన 1,154 పోస్టుల్లో 472 భర్తీ కాలేదని వివరించింది. తాత్కాలిక నియామకాల వల్ల విద్యా స్వేచ్ఛకు విఘాతం కలిగించకూడదని స్థాయీ సంఘం నివేదిక హెచ్చరించింది.

క్షిపణులను సిద్ధం చేస్తున్నాం

ట్రంప్ హెచ్చరికలకు ఇరాన్ స్పందన

న్యూఢిల్లీ, మార్చి 31: తమ షరతులకు లోబడి అణు కార్యక్రమంపై ఒప్పందం కుదుర్చుకోని పక్షంలో బాంబు దాడులను ఎదుర్కోవలసి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేసిన కొన్ని గంటల్లోనే ఇరాన్ దీటుగా స్పందించింది. క్షిపణులను సిద్ధం చేస్తున్నట్టు ఆ దేశం ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా సంబంధిత స్థావరాలపై దాడి చేసే సామర్థ్యం గల క్షిపణులను ఇరాన్ సిద్ధం చేస్తున్నట్టు ప్రభుత్వ యాజమాన్యంలోని టెహ్రాన్ టైమ్స్ సోమవారం ప్రకటించింది. అలాగే తమపై జరిగే బాంబు దాడులను సమర్థవంతంగా ఎదుర్కొంటాయని టెహ్రాన్ టైమ్స్ వెల్లడించింది. తాను చెప్పిన డిమాండ్లకు లోబడి కొత్త అణు ఒప్పందానికి ఇరాన్ ఒప్పుకోని పక్షంలో బాంబు దాడులు ఉంటాయని ఆదివారం ట్రంప్ హెచ్చరించారు. గతంలో ఇరాన్ ఎన్నడూ చూడని రీతిలో బాంబు దాడులు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

ట్రంప్ విధానాలపై భారీ నిరసన

డాలస్‌లో వేలాది మంది వలసదారుల ప్రదర్శన

అమెరికా వలస విధానాలకు వ్యతిరేకంగా డాలస్‌లో వలసదారుల భారీ ర్యాలీ

డాలస్, వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ అమలు చేస్తున్న ఇమిగ్రేషన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ వేలాది మంది వలసదారులు సోమవారం డాలస్‌లో ప్రదర్శన నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఇమిగ్రేషన్ అధికారులు నిర్బంధించిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. వీరంతా దేశభక్తి, ఐకమత్యాలను చాటుకునేందుకు అమెరికా జెండాలని పట్టుకుని నినాదాలు చేశారు. ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో ఇటీవల ప్రతిష్ఠాత్మక అమెరికన్ విశ్వవిద్యాలయాల నుంచి అరెస్టయిన వారిని గుర్తు తెచ్చే బ్యానర్లను కూడా పట్టుకున్నారు.

మూడోసారి అధికారం అంత సులభం కాదు!

రాజ్యాంగం అనుమతించక పోయినా డొనాల్డ్ ట్రంప్ మూడోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి ప్రయత్నిస్తున్నారు. తొలుత జేడీ వాన్స్‌ను అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టించి, తర్వాత దానిని ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మీకు బదిలీ చేస్తారా? అన్న ఒక ప్రశ్నకు అదీ ఒక పద్ధతని ట్రంప్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. అయితే మూడోసారి అధ్యక్షుడు కావడం అంత సులభం కాదని.. అమెరికా అధ్యక్షుని ఎన్నికపై ఉన్న రెండు దఫాల నిబంధనను మార్చాలంటే రాజ్యాంగ సవరణతో పాటు మెజారిటీ రాష్ట్రాల ఆమోదం అవసరం అని నిపుణులు చెప్తున్నారు.

ఇకపై అన్ని దేశాలపై ప్రతీకార సుంకాలు

అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కొన్ని దేశాలపై టారిఫ్‌లు విధిస్తూ హడలగొడుతున్న డొనాల్డ్ ట్రంప్.. ఆ సుంకాల అమలుకు పెట్టిన డెడ్‌లైన్ ఏప్రిల్ 2వ తేదీ గడువు సమీపిస్తున్న వేళ మరో పిడుగులాంటి హెచ్చరిక చేశారు. సుంకాల విధింపు కొన్ని దేశాలకే పరిమితం కాదని, తమతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వాణిజ్య సంబంధాలు జరుపుతున్న దేశాలన్నింటికీ ఈ టారిఫ్‌లు అమలవుతాయని ఆయన స్పష్టం చేశారు.

గ్రీన్‌లాండ్ అమెరికాకు దక్కదు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు అర్కిటిక్ ద్వీపం దక్కదని గ్రీన్‌లాండ్ కొత్త ప్రధాని నీల్సన్ స్పష్టం చేశారు. శుక్రవారం కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక ట్రంప్ ప్రకటనపై ఆయన స్పందిస్తూ 'మేం మరెవరికీ చెందిన వారం కాదు. మా భవిష్యత్తును మేమే నిర్ణయించుకుంటాం' అని వ్యాఖ్యానించారు.

రేపు లోక్‌సభ ముందుకు వక్ఫ్ బిల్లు!

సమాజంలో అశాంతికి కొన్ని పార్టీల యత్నం: రిజిజు

న్యూఢిల్లీ: సవరించిన వక్ఫ్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 2న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. 2024 ఆగస్టులో సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) పరిశీలనకు వెళ్లిన వక్ఫ్ బిల్లుపై ఇదివరకు లోక్‌సభలో ప్రవేశపెట్టిన సందర్భంగా ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో వ్యతిరేకతను తెలిపాయి. సవరించిన వక్ఫ్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టే ముందు ప్రతిపక్ష ఇండియా కూటమి నాయకులతో సీనియర్ బీజేపీ మంత్రులు చర్చలు జరిపే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 4వ తేదీతో ముగియనున్నాయి. ఆలోగా వక్ఫ్ బిల్లు లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదం పొందాల్సి ఉంటుంది. కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సవరించిన వక్ఫ్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

పరీక్షకు ముందు జేఈఈ విద్యార్థి ఆత్మహత్య

న్యూఢిల్లీ: మరో రెండు రోజుల్లో జేఈఈ పరీక్షకు హాజరవ్వాల్సిన ఓ 18 ఏండ్ల విద్యార్థి హఠాత్తుగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జేఈఈ ఎంట్రెన్స్ పరీక్షల కోచింగ్‌కు ముఖ్య కేంద్రంగా ఉన్న రాజస్థాన్ కోటా నగరంలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఇక్కడి పోలీస్ అధికారి శంకర్‌లాల్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన ఉజ్వల్ మిశ్రా కోటాలోని ఓ హాస్టల్‌లో ఉంటూ జేఈఈ పరీక్షలకు కోచింగ్ తీసుకుంటున్నాడు. ఏప్రిల్ 2 నాటి జేఈఈ-మెయిన్స్ పరీక్ష కోసం ఉజ్వల్ మిశ్రా లక్నో వెళ్లాల్సి ఉంది. కానీ, ఉజ్వల్ మిశ్రా ఆదివారం సాయంత్రం 6.30గంటలకు కోటా రైల్వే స్టేషన్‌కు చేరుకొని, వేగంగా వస్తున్న ఓ రైలుకు ఎదురుగా వెళ్లి..పట్టాలపై పడుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జేఈఈ-మెయిన్స్, అడ్వాన్స్ కోసం ఉజ్వల్ గత రెండేండ్లుగా కోటాలో కోచింగ్ తీసుకుంటున్నట్టు తెలిసింది.

మైనారిటీలపై హింసలో యూపీ అగ్రస్థానం

11 ఏండ్లలో దేశ వ్యాప్తంగా 568 ఫిర్యాదులు

న్యూఢిల్లీ, మార్చి 31: మైనారిటీలపై హింసకు సంబంధించి 2014-15 నుండి 2024-25 వరకు జాతీయ మైనారిటీల కమిషన్(ఎన్‌సీఎం)కు 568 ఫిర్యాదులు అందాయి. వీటిలో అత్యధికంగా 251 ఫిర్యాదులు బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తర్ ప్రదేశ్ నుండే అందాయి. డీఎంకే ఎంపీ పీ విల్సన్, సీపీఎం ఎంసీ జాన్ బ్రిట్టాస్ ప్రశ్నకు కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు రాజ్యసభలో ఈ మేరకు సమాధాన మిచ్చారు. మైనారిటీలపై జరిగే హింసకు సంబంధించిన నిర్దిష్టమైన వివరాలు కేంద్ర ప్రభుత్వం వద్ద ఉండవని, ఆ ఫిర్యాదులను ఎన్‌సీఎం పరిశీలిస్తుందని ఆయన తెలిపారు. తమకు అందిన ఫిర్యాదులపై తదుపరి చర్యల కోసం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు నివేదిస్తామని ఆయన వెల్లడించారు. విల్సన్ అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వకంగా జవాబిస్తూ గడచిన 11 ఏండ్లలో ఎన్‌సీఎంకు 568 ఫిర్యాదులు అందాయని చెప్పారు. వాటిలో యూపీ తర్వాత స్థానంలో 80 ఫిర్యాదులతో ఢిల్లీ ఉందన్నారు. మధ్యప్రదేశ్, హర్యానా నుంచి 33 ఫిర్యాదులు, కేరళ నుంచి 20 ఫిర్యాదులు అందాయని తెలిపారు.

వాటర్ డ్రోన్

ట్రయల్ రన్ విజయవంతం

న్యూఢిల్లీ: శత్రు యుద్ధ నౌకలపై నిఘా పెట్టే వాటర్ డ్రోన్‌ను డీఆర్‌డీవో ఆదివారం విజయవంతంగా పరీక్షించింది. భూ ఉపరితలం, నీటిపై నిర్వహించిన ఈ పరీక్షలో వెహికల్ సోనార్‌లు, కమ్యూనికేషన్ వ్యవస్థలు చక్కగా పనిచేసినట్టు డీఆర్‌డీవో తెలిపింది. ఈ పరీక్ష విజయవంతం కావడంతో మన దేశ అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరిందని పేర్కొంది. భూమిపై, సముద్ర జలాల్లో పనిచేసే ఈ డ్రోన్ ద్వారా శత్రు దేశాల యుద్ధ నౌకలపై నిఘా పెట్టవచ్చునని తెలిపింది. ఈ వాటర్ డ్రోన్ 6 టన్నుల బరువుంటుందని, గరిష్ఠంగా గంటకు 14 కి.మీ వేగంతో 300 మీటర్ల లోతు వరకు వెళ్లగలదని డీఆర్‌డీవో తెలిపింది.

జూన్ వరకు భగభగలే

తెలుగు రాష్ట్రాల్లో వడ గాడ్పులు!

న్యూఢిల్లీ: దేశంలో ఈసారి ఏప్రిల్ నుంచి జూన్ వరకు దేశంలోని పశ్చిమ, తూర్పు ప్రాంతాలు మినహా చాలా చోట్ల సాధారణ స్థాయి కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, వాయువ్య, మధ్య, తూర్పు ప్రాంతాల్లో ఎక్కువ రోజులపాటు వడగాడ్పులు వీస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ సారి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల్లో సాధారణ స్థాయికి మించి 2 నుంచి 4 రోజుల పాటు తీవ్రమైన వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నదని స్పష్టం చేసింది.

పీఎఫ్ ఆటో సెటిల్‌మెంట్ రూ.5 లక్షలకు పెంపు!

7.5 కోట్ల మంది సభ్యులకు ప్రయోజనం

న్యూఢిల్లీ, మార్చి 31: ప్రావిడెంట్ ఫండ్ సభ్యులకు కేంద్రం శుభవార్త తెలపనుంది. ఇప్పటివరకు ఆటో సెటిల్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ క్లెయిమ్ (ఏఎస్ఏసీ)పై ఉన్న లక్ష రూపాయ పరిమితిని రూ.5 లక్షలకు పెంచుతున్నట్టు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్ఓ) ప్రకటించే అవకాశం ఉందని ఏఎన్ఐ వార్తా సంస్థ తెలిపింది. ఇప్పుడున్న లక్ష రూపాయలను ఐదు రెట్లు పెంచి ఐదు లక్షలకు పెంచుతూ చేసిన ప్రతిపాదనకు కేంద్ర కార్మిక, ఉద్యోగ శాఖ కార్యదర్శి సుమితా దవ్రా ఆమోదం తెలిపారు. గత వారం కశ్మీర్‌లో సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ రమేష్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో దీనిని ప్రతిపాదించారు. దీనిని తుది ఆమోదముద్ర కోసం సీబీటీకి పంపారు. ఇది అమలులోకి వస్తే ఏఎస్ఏసీ ద్వారా రూ.5 లక్షలు విత్‌డ్రా చేసుకునే ప్రయోజనం సుమారు 7.5 కోట్ల మంది పీఎఫ్ సభ్యులకు చేకూరుతుంది. అనారోగ్య, వైద్య చికిత్స కోసం సభ్యులు అడ్వాన్స్ కింద గరిష్ఠంగా రూ.50 వేల నగదు అత్యవసరంగా డ్రా చేసుకునే సౌకర్యాన్ని 2020 ఏప్రిల్‌లో ప్రవేశపెట్టారు.

కన్యత్వ పరీక్ష గౌరవాన్ని ఉల్లంఘించడమే

- నపుంసకత్వ లోపం కప్పి పుచ్చుకోవడానికి భార్య శీలంపై అనుమానాలు లేవనెత్తొద్దు
- విడాకుల కేసులో ఛత్తీస్‌గఢ్ హైకోర్టు

రాయ్‌పూర్: భార్యకు కన్యత్వ నిర్ధారణ పరీక్ష చేయాలని డిమాండ్ చేయడం మహిళల గౌరవ హక్కును ఉల్లంఘించడమే కాక, రాజ్యాంగ విరుద్ధమని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు తీర్పు చెప్పింది. భార్యకు కన్యత్వ పరీక్ష చేయాలంటూ భర్త చేసిన డిమాండ్‌ను కొట్టివేస్తూ కింది కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తున్నట్టు జస్టిస్ అరవింద్‌కుమార్ వర్మ తీర్పు చెప్పారు. కేసు వివరాల్లోకి వెళితే.. ఛత్తీస్‌గఢ్‌లో ఒక జంటకు 2023 ఏప్రిల్ 30న పెండ్లయ్యింది. అయితే తన భర్త నపుంసకుడని, సంసారానికి పనికిరాడని పేర్కొంటూ, తనకు నెలకు రూ.20 వేల భరణంతో విడాకులు ఇప్పించాలంటూ రాయ్‌గర్ జిల్లా కోర్టులో భార్య కేసు వేసింది. అయితే తన భార్య ఆమె బావతో వివాహేతర సంబంధం పెట్టుకుందని, విడాకుల కోసమే ఈ ఆరోపణలు చేస్తున్నదని భర్త వాదించారు. ఆమె ఆరోపణలు నిజం కాదని రుజువు చేసేందుకు ఆమెకు కన్యత్వ పరీక్షను చేయాలని డిమాండ్ చేశాడు. అతడి వాదనను కోర్టు కొట్టివేసింది. దీనిపై అతను హైకోర్టును ఆశ్రయించగా, దీనిపై స్పందించిన హైకోర్టు తనపై వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవని రుజువు చేయడల్కుకునేందుకు భర్త.. వైద్య పరీక్షలు కాని, ఇతర అధారాలు కాని చూపాలని కోరుతూ, లోపాలను కప్పిపుచ్చుకోవడానికి శీలంపై అనుమానాలు వద్దని పేర్కొంది.

జీవుల పరిణామానికి ఆకలే కారణం!



న్యూఢిల్లీ: ఏక కణ జీవులు బహు కణ జీవులుగా ఎలా పరిణామం చెందాయి? అనే ప్రశ్న శాస్త్రవేత్తలను అనేక సంవత్సరాల నుంచి వేధిస్తున్నది. ఈ చిక్కు ప్రశ్నకు మెరైన్ బయలాజికల్ ల్యాబొరేటరీ పరిశోధకులు సమాధానం చెప్తున్నారు. ఏక కణ జీవులు పరస్పర సహకారంతో ఆహారాన్ని సంపాదించుకోవడమే బహు కణ జీవుల పరిణామానికి కారణం కావచ్చునని చెప్పదగిన ఆధారాలను ఈ అధ్యయనం గుర్తించింది. ఈ పరిణామం 250 కోట్ల సంవత్సరాల క్రితం జరిగి ఉండవచ్చునని అంచనా వేసింది. ప్రావిడెన్స్ కాలేజ్‌లో మెరైన్ బయాలజిస్ట్ జూన్ కోస్టెల్లో మాట్లాడుతూ.. జీవులు స్వతంత్రంగా, వ్యక్తిగతంగా వ్యవహరించిన తొలి దశను పరిశీలించామని చెప్పారు. అట్లాంటాస్ ఎమోరీ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ శశాంక్ శేఖర్ మాట్లాడుతూ స్టెంటర్ ఆహారం తీసుకునే విధానాన్ని తాము పరిశీలించామన్నారు. స్టెంటర్ అంటే జెయింట్ ట్రంపెట్ ఆకారంలో ఉంటుందని, 2 మిల్లీమీటర్ల